"ఏమైంది దానికి?..."

రెడ్డి మాటకి అడ్డొచ్చి "ఈ సమయంలో మనం వీధిలోకి దేనికి వెళ్ళడం?... మీ పంచలో కూర్చుని మాట్లాడుకుందాం..."

ముగ్గురూ కుర్చీల్లో కూర్చుండిపోయారు.

"ఇంతకూ నువ్వు చెప్పొచ్చింది దేన్నిగురించి బ్రహ్మానందం...?" అడిగాడు రెడ్డి.

"అదే... మన ఊరికి కొత్తగా వచ్చిన యస్సై లేడూ... ఇదంతా ఆయనగారి నిర్వాకమేనని మన పోలీసు కానిస్టేబులు నాంచారయ్య కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ నాతో రహస్యంగా చెప్పాడు, ఇంతకుముందే మా ఇంటిముందుగా వెడుతూ..."

'సైదులమ్మ చావుకీ... పోలీసు ఇన్స్పెక్టర్ గారికీ ఏమిటయ్యా సంబంధం...?" నిలదీసి అడిగాడు గోవిందయ్య.

"రాత్రి సారా దుకాణం మూసేసి పదిగంటలు దాటేక సైదులమ్మ నడిచివెడుతోందట... సరిగ్గా అదే సమయంలో మన యస్సై బాగా మందు పట్టించాడో ఏమో-రోడ్డుమీద ఆమెకు ఎదురైనాట్ట..."

"ఆ! తర్వాత?..." ఆత్రంగా అడిగాడు గోవిందయ్య.

"బ్రోతల్ కేసు బనాయిస్తానని బెదిరించి స్టేషన్లోనే... తన మానాన్ని దోచుకున్నందుకు యస్సైని కొరికిందట... గిచ్చిందట... ఆపళాన లాఠీతో చావచితక్కొట్టి... ఈడ్చుకెళ్ళి ఊరి చివర బావిలో పడేశాట్ట..." క్లుప్తంగా చెప్పి కళ్ళు తుడుచుకున్నాడు బ్రహ్మానందం.

"ఇదంతా... నాంచారయ్యకెట్లా తెలిసిందీ?..." రెడ్డి అడక్కుండా వుండలేకపోయాడు.

"ఈ బాగోతమంతా స్టేషన్లో డ్యూటీలోవున్న నాంచారయ్య కళ్ళముందే జరిగిందట... మళ్ళీ ఈ విషయం ఎక్కడా అనకండి... మన కొంపలు అంటుకుంటాయ్..."

ఆ మాట విన్న పెద్దరెడ్డి, గోవిందయ్య అవాక్కయ్యారు. శిలాప్రతిమల్లా వుండిపోయారు.

---

★(ఆంధ్రభూమి మాసపత్రిక సెప్టెంబరు 1990 లో ప్రచురితం)